క్లుప్తంగా

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాలకు శనివారం భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె గ్రామంలో వెలసిన , సుళేకేరి గ్రామ శివారులో, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామి వారికి తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు జరిపించారు.

పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం తగదు



శానిటరీ ఉద్యోగులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: పట్టణంలో పారిశుద్ధ్య పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ సూచించారు. పనిముట్లు లేవనే సాకుతో పనులను ఆపొద్దని, ఏయే పనిముట్లు అవసరమవుతాయో నివేదిక ఇస్తే సత్వరమే ఏర్పాటు చేస్తానని తెలిపారు. శనివారం కమిషనర్ చాంబర్‌లో శానిటరీ సెక్షన్ ఉద్యోగులతో శానిటేషన్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆదోనిలో శానిటేషన్ సరిగా లేదని ఫిర్యాదులొస్తున్నాయని, ఇక నుంచి అలాంటివి పునరావృతం కారాదన్నారు. మురుగు కాలువల్లో పూడికతీత పనులు, చెత్తకుప్పలు తొలగించడంలో నిర్లక్ష్యం చేయొద్దని చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కౌతాళం: అండర్–17 సాఫ్ట్‌బాల్ విభాగంలో రాఘవ, శారద, అండర్–14 విభాగంలో చైతన్య, పూజ, అండర్–14 కబడ్డీ పోటీలకు నీలకంఠ, అండర్–14 అథ్లెటిక్స్ విభాగంలో ఈరన్న, అండర్–17ఖోఖో విభాగంలో హరికృష్ణ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఎరిగేరి జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్‌నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు రాములు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఆయా క్రీడా పోటీల్లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పా. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయులతో కలిసి సన్మానించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న ఎంటీఎఫ్ నాయకులు

ఆదోని సెంట్రల్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఏపీఎంటీఎఫ్ అధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను పురపాలక, నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున ఆలీమ్ సిద్దిఖీ పంపిణీ చేశారు. శనివారం పురపాలక ఉన్నత పాఠశాలలో పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య పట్టణ శాఖ అధ్యక్షుడు అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఈ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య నాయకులు సురేష్ కుమార్, కోటన్న, బసవరాజు, జంగం బసవరాజు ఆనంద్, చంద్రశేఖర్ శర్మ, పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న ఎంపీపీ ఈరన్న

కోసిగి: స్థానిక కడపాళెం కాలనీలో తిమ్మప్ప కొండ దిగువ భాగంలో కొత్తగా నిర్మిస్తున్న కందనాతి మారెమ్మవ్వ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి రూ.51వేలు విరాళంగా అందజేశారు. శనివారం ఎమ్మెల్యే తరఫున ఎంపీపీ ఈరన్న , బుళ్లి నరసింహులు నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ డిసెంబర్ ఆఖరులోపు నిర్మాణ పనులు పూర్తి చేసి జనవరి నెలలో ప్రారంభించి దేవర ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. కమిటీ సభ్యులు శివారెడ్డి, చిన్న నింబయ్య, గోసుల నాగిరెడ్డి, పరసాని రమేష్, రామాంజనేయులు, వీరారెడ్డి, అంజినయ్య, గోవిందు, కోసిగయ్య, తిమ్మప్ప, ఎం.నాగిరెడ్డి, మారెయ్య, తాయన్న ఉన్నారు.



నందవరం నుంచి టెంపోలో వలస వెళ్తున్న కూలీలు



డీసీఎం వాహనంలో పిల్లలతో కలిసి తెలంగాణకు వలస వెళ్తున్న కూలీలు

తెలంగాణకు వలస..

నందవరం : ఉపాధి కరువై..బతుకు జీవనం బరువుపై కూలీలు వలసలు వెళ్తున్నారు. ఇంటిల్లిపాది తట్టాబుట్ట సర్దుకుని సుగ్గిబాట పట్టారు. చిన్నపిల్లలతో సహా ఇతర ప్రాంతాలకు బతుకుదెరువు కోసం బయలుదేరారు. శనివారం మండల కేంద్రానికి చెందిన దాదాపు 50 కుటుంబాలు 3 టెంపోలు, ఒక డీసీఎం వాహనంలో తెలంగాణ రాష్ట్రం, షాద్‌నగర్ నగరంలోని పరిగి మండలానికి వలస వెళ్లారు. ఇక్కడ వ్యవసాయ పనులు, ఉపాధి లేక వలస వెళుతున్నట్లు గ్రామానికి చెందిన అంజనేయులు, రమేష్, కురవ నాగేంద్ర, బోయ రవి, బాలరాజు, బీరప్ప ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ పొలాల్లో, పరిశ్రమల్లో ఏదో ఒక పని చేసి బతుకవచ్చనే ఆశతో వెళ్తున్నట్లు చెప్పారు.

సమగ్ర సస్యరక్షణ పద్ధతులతో మంచి దిగుబడులు



మాట్లాడుతున్న డాక్టర్ ఎం.జాన్సన్

ఎమ్మిగనూరురూరల్: రైతులు పంటల సాగులో సమగ్ర సస్య రక్షణ పద్ధతులను పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.జాన్సన్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే సమన్వయ కర్త డా.కె.రాఘవేంద్ర చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన సందర్శన, శిక్షణ కార్యక్రమానికి కర్నూలు, నంద్యాల వ్యవసాయ సంచాలకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పప్పు శనగ సాగులో పొగమంచు వల్ల పూత రాలడం, కాయరాలుతుందని, నివారణకు 13–0–45 5 గ్రాములు, బోరాన్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజాయేట్ 0.4 గ్రా. లీటరు నీటిలో కలిపి స్ప్రే చేసుకోవాలని, మిరపలో ఎండు తెగులు నివారణకు ట్రైకోడెర్మా విరిడి 5 గ్రాములు, సుడోమోనోస్ 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే తెగుళ్లను నివారించవచ్చుని తెలిపారు. కేవీకే రెడ్డిపల్లి సమన్వయకర్త డా. ఎస్ఎస్.మల్లేశ్వరి, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, కర్నూల్ ఇన్‌చార్జ్ ఏడీఏ బాలవర్ధరాజు, నంద్యాల ఇన్‌చార్జ్ ఏడీఏ శారద, డా.ఏఆర్‌కె.రావు, ఏరువాక కేంద్రం డా. రవికిషోర్, కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ రంగంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఆదోని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్

ఆదోని సెంట్రల్: మార్కెటింగ్ రంగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆదోని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ తెలిపారు. శనివారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు మార్కెటింగ్ రంగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నైపుణ్యాలను కలిగిన ప్రతి ఒక్కరూ ఉన్నత అవకాశాలను సొంతం చేసుకుంటారని చెప్పారు. విద్యార్థులు డిజిటల్, మార్కెటింగ్ రంగాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విజయవాడ హిందుస్థాన్ కోకో కోలా బేవరేజెస్ ఫౌండేషన్ తరఫు/న పి.ఎం.ఖలీల్ బాషా మాట్లాడుతూ..వ్యాపార, మార్కెటింగ్ రంగాల్లో తీసుకోవాల్సిన మెళకువలను వివరించారు. నీడ్ ఫర్ సేల్స్ అండ్ మార్కెటింగ్ స్కిల్స్‌పై విద్యార్థులకు రెండు రోజులు పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్లు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ కో ఆర్డినేటర్ నరసప్ప, కళాశాల వాణిజ్య విభాగ అధిపతి చంద్రశేఖర్, కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి రామకృష్ణ, అధ్యాపకుడు జోనాథన్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఇబ్రహీంపురం దగ్గర అక్రమంగా తరలిస్తున్న 7 బాక్సుల కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయ అవరణలో పట్టుబడిన మద్యాన్ని చూపి మాట్లాడుతూ నందవరం మండలం ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన మహేష్ ఏపీ21బీవీ 6121 నంబర్ గల బైక్‌పై కర్ణాటక మద్యాన్ని తీసుకొస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. ఏడు బాక్సుల్లోని 672 (90ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ డిలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు, బైక్‌ను స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని వివరించారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం

మంత్రాలయం : మండలంలోని మాధవరం గ్రామ శివారులో ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తున్న వ్యక్తిని మాధవరం పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు..కోసిగి మండలం డి.బెళగల్ గ్రామానికి చెందిన తిరుమలేష్, చెన్నకేశవరెడ్డి కర్ణాటక రాష్ట్రానికి చెందిన 384 మద్యం ప్యాకెట్లను ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా వాహన తనిఖీల్లో గుర్తించి బైక్, మద్యంను సీజ్ చేసి కేసు నమోదు చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించండి

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీలో ఆస్తి, నీటి పన్ను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, రెవెన్యూ ఆఫీసర్ నాసిర్‌అహ్మద్ కోరారు. శనివారం రెవెన్యూ సెక్షన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఆదోని మున్సిపాలిటీలో ఏడాదికి ఆస్తి పన్ను రూ.15 కోట్లు కాగా, నేటి వరకు రూ.5.5 కోట్లు వసూలైందని తెలిపారు. ఏడాదికి నీటి పన్ను ద్వారా రూ.8 కోట్లు రావాల్సి ఉండగా.. ఇప్పటివరకు రూ.1.50 కోట్లు వసూలైందని తెలిపారు. పన్నుల వసూళ్లలో ప్రజలు, వ్యాపారులు అవలంభిస్తున్న తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్తి పన్ను రూ.9 కోట్లు, నీటి పన్ను రూ.6.50 కోట్లు వసూలు కావాల్సి ఉందని, ఇందుకోసం ప్రత్యేకంగా ఈనెల 4వ తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. ఈనెల 4వ ఆస్తి, నీటి పన్ను చెల్లించని వారి ఇళ్లల్లో కుళాయి కనెక్షన్ కట్ చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే పట్టణంలో 2,100 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. వార్డు సచివాలయ, మున్సిపల్ ఇంజినీరింగ్ ఉద్యోగులు ప్రత్యేక బృందంగా ఏర్పడి పన్నుల వసూళ్ల కార్యాచరణ ప్రణాళికను రూపొందించామన్నారు. టాప్–10లో వంద మంది పన్ను బకాయిలు చెల్లించలేదని, వారిపై ప్రత్యేకంగా టీం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మున్సిపల్ షాపుల యజమానులు 43 మందికి నోటీసులు జారీ చేశామని, వీలైనంత త్వరగా పన్నులు చెల్లించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటరు జాబితా సిద్ధం చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శివరాముడు

ఆదోని రూరల్: నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా సిద్ధం చేయాలని ఆదోని తహసీల్దార్ శివరాముడు సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో నీటి సంఘాల ఎన్నికల ఓటరు జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండంలోని పెద్దహరివాణం , సంతెకూడ్లూరు, యడవలి, బలాదూర్, చిన్నగొనేహాల్, మదిరె, బసాపురం, ఇస్వీ, ధణాపురం, నాగనాథనహళ్లి గ్రామాలకు సంబంధించిన ఓటరు జాబితాను సిద్ధం చేసి ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు ప్రదర్శించాలని చెప్పారు. ఏవైనా సందేహాలు ఉంటే 11 నుంచి 12వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో హుల్తిలింగేశ్వర, కారుమంచేశ్వరస్వాములు

పత్తికొండ(తుగ్గలి) : మండలంలోని పెద్దహుల్తిలో వెలసిన హుల్తి లింగేశ్వర, కారుమంచేశ్వరస్వాముల బ్రహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం స్వాముల వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి మండపూజ, ఊరేగింపు చేపట్టారు. ఉత్సవాలను తిలకించేందుకు కర్ణాటకతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో గ్రామం కిక్కిరిసిపోయింది. ఆదివారం వేకువజామున గంగపూజ అనంతరం స్వామి కాలి ఆట ప్రధాన ఘట్టాలను చూసేందుకు భక్తులు తరలిరానున్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

కోసిగి: రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హెచ్‌ఆర్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోడి ఉరుకుందప్ప అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న చట్టాలను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. చట్టాల పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 9వ తేదీన స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో హెచ్‌ఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో 10వ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు రెండు తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, వి.ఎస్ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్ హాజరు కానున్నట్లు చెప్పారు. మహాసభలకు ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

మట్కా బీటర్ల అరెస్ట్

ఆదోని అర్బన్: పట్టణంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మట్కా ఆడుతున్న ఇద్దరిపై పోలీసులు శనివారం దాడులు చేశారు. కార్వన్‌పేటకు చెందిన అల్లీహుసేన్, బండిమెట్ట కాలనీకి చెందిన ఈరప్పను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.30,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

మత గురువు సంస్మరణ సభ



సంస్మరణ సభలో పాల్గొన్న ముస్లింలు

ఆదోని రూరల్: ఇటీవల మృతి చెందిన మత గురువు డాక్టర్ సయ్యద్ ఖమర్ పీర్‌సాహెబ్ సంస్మరణ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని కొడల్‌పేటలోని బదర్ గుల్షన్ నుంచి మాసుమ్ పీర్ హుసేని దర్గా వరకు గంధం ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

ఆదోని అర్బన్: పట్టణంలోని మేదర్ వీధి నూతన బ్రిడ్జి వద్ద ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్లలో గుంతలు లేకుండా చేయాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మిషన్ పార్ట్ హోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని చెప్పారు.

ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్‌కు సన్మానం



నాగరాజును సత్కరిస్తున్న డిపో మేనేజర్, సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న జీవి.నాగరాజు వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం స్థానిక డిపో ఆవరణలో ఆయనను డిపోమేనేజర్ అమర్నాథ్‌తో పాటు సిబ్బంది ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. వివిధ యూనియన్ల నాయకులు ఎస్ఎం రఫీక్, కేఎండీ సాధిక్, ఎన్‌పీఎం సాహెబ్, వైఆర్ చంద్ర,భాస్కర్, గంగన్న, మూర్తి,రమణ పాల్గొన్నారు.

వెండి కిరీటాలు చోరీ



వెండి కిరీటాలతో స్వామివార్లు (ఫైల్)

పెద్దకడబూరు : మండలంలోని కల్లుకుంట గ్రామంలో వెలసిన భీరప్ప స్వామి ఆలయంలో రెండు విగ్రహాల కిరీటాలు చోరీకి గురయ్యాయి. ఆలయ పూజారి అళ్లప్ప, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో వెలసిన భీరప్ప స్వామి ఆలయంలో విగ్రహాలకు దాదాపు రూ.లక్షకు పైగా వెచ్చించి రెండు వెండి కిరీటాలను చేయించారు. శుక్రవారం అమావాస్య కావడంతో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు. రాత్రి ఆలయాన్ని మూసే సమయంలో చూడగా రెండు కిరీటాలు కనిపించకపోవడంతో చోరీకి గురయినట్లు నిర్ధారించుకున్నారు. అయితే చోరీపై విచారణ చేస్తున్నామని, ఇంకా పోలీసులకు ఫిర్యాదు చేయలేదని పూజారి, గ్రామస్తులు తెలిపారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సహకరించండి



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: డిసెంబర్ 14వ తేదీన జరిగే నేషనల్ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా పోలీసులు, న్యాయవాదులు చూడాలని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ సూచించారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఆయా స్టేషన్లలో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని కేసులు రాజీ చేయగలరనే అంశాలపై ఆరా తీశారు. ప్రజలకు లోక్‌అదాలత్‌పై అవగాహన కలిగించి అధిక కేసులు పరిష్కరించడానికి సహకరించాలని కోరారు. మండలంలోని జ్యుడీషియల్ ఆఫీసర్స్, సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి అర్చన, మొదటి శ్రేణి అదనపు న్యాయమూర్తి సాయిలీలా సుభాష్, రెండో శ్రేణి అదనపు న్యాయమూర్తి కుమారి సాయిశ్రీవల్లి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలని మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు పేర్కొన్నారు. పట్టణంలోని భాష్యం పాఠశాలలో ఆర్ఎంజి రెడ్డి సహకారంతో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతిని గెలుపొందిన మాచాని సోమప్ప ఇంగ్లిష్ మీడియం హౌస్కూల్ విద్యార్థి ఎస్.ధనియా షగునా, రెండో బహుమతి సాధించిన గుడ్‌బేస్ పాఠశాల విద్యార్థి అమాన్‌లకు మాజీ కౌన్సిలర్ మధుబాబు, ప్రిన్సిపాల్ కవితతో కలిసి శనివారం బహుమతులు అందజేశారు. ఆలూరు కృష్ణ,గౌడ్, శివ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనాల మంజూరు

పెద్దకడబూరు : రబి సీజన్‌లో సాగు చేయడానికి మండలానికి 140 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ విత్తనాలు మంజూరయ్యాయని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ మండలానికి కే–6 రకానికి చెందిన వేరుశనగ విత్తనాలు కేటాయించారన్నారు. క్వింటా విత్తనాల ధర రూ.9,600 కాగా సబ్సిడీ రూ.3,840 పోనూ రైతులు రూ.5,760 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే అందజేస్తామని చెప్పారు. అలాగే రబీ సీజన్ నుంచి పంటల బీమాకు రైతులు ప్రీమియం చెల్లించాలని సూచించారు. పంటల బీమా పథకం కింద అర్హత పొందడానికి శనగకు ఎకరాకు రూ.420, వరికి రూ.630, జొన్నకు రూ.297, వేరుశనగకు రూ.480, ఉల్లికి రూ.1,350 చెల్లిస్తే ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం వర్తిస్తుందన్నారు. అలాగే టమాటకు రూ.1,500లు చెల్లిస్తే వాతావరణ ఆధారిత బీమాకు అర్హులు అవుతారన్నారు. డిసెంబర్ 31లోపు ప్రీమియం చెల్లించాలని సూచించారు.

గుండె గు‘బిల్లు’





చిన్న ఇంటికి కరెంట్ బిల్ ఎక్కువ వచ్చిందని చెబుతున్న రహంతుల్లా

హొళగుంద: స్థానిక ఈబీసీ కాలనీకి చెందిన మెకానిక్ రహంతుల్లా ఉండే చిన్న ఇంటికి రూ.1,119 కరెంట్ బిల్లు వచ్చింది. గతంలో రూ.500 వరకు బిల్లు వచ్చేదని, నాలుగు నెలలుగా కొద్దికొద్దిగా పెరుగుతూ ఈ నెల ఏకంగా రూ.1,119 బిల్లు రావడంతో కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. ఇల్లు తప్ప తమకు ఎలాంటి ఆస్తులు లేని, మెకానిక్ పని చేసుకుంటూ తన భార్య, నలుగురు పిల్లలతో కుటుంబాన్ని పోషించుకుంటున్నానని రహంతుల్లా వాపోయాడు. రెండు ఫ్యాన్లు ఉన్నా ఎండాకాలంలో మాత్రమే ఒకు ఫ్యాన్ వాడుతామని, రెండు లైట్లు మాత్రమే వాడతామని చెప్పారు. వీటికే ఇంత బిల్లు వస్తే తాము ఎలా జీవించాలని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికే నిత్యావసర సరుకులు ధరలు పెరిగి అల్లాడుతుంటే కరెంట్ బిల్లు షాక్ ఇస్తోందన్నాడు. బిల్లు విషయాన్ని విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని చెప్పాడు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: స్థానిక కస్తూర్బా విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు గతనెల 29,30వ తేదీల్లో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి సౌత్ జోన్ జోన్ పోటీల్లో రాణించి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ చైతన్య స్రవంతి శనివారం తెలిపారు. రోప్ స్కిప్పింగ్‌లో అండర్ –17 విభాగంలో జ్యోతి రాణించి రెండవ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే అయిషా (30 సెకండ్స్ స్పీడ్ విభాగంలో) మూడవ స్థానంలో నిలిచి ఈనెల 29,30వ తేదీల్లో గోవాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థినులు, పీఈటీ సుప్రియను అభినందించారు.

చిన్నారులకు సాయం



చిన్నారులకు నగదు, దుస్తులు అందజేస్తున్న దాతలు

పత్తికొండ(తుగ్గలి) : తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మిగిలిపోయిన చందోలికి చెందిన ముగ్గురు చిన్నారులను ఆదుకునేందుకు దాతలు స్పందిస్తున్నారు. శనివారం బుడగ జంగాల వెంకటేష్, జయన్న, చందోలి సలీంబాషా రూ.25వేల నగదు, దుస్తులను చిన్నారులకు అందజేశారు. గ్రామ పెద్దలు ముత్యాల జయన్న, ఈశ్వరయ్య, మాజీ సర్పంచ్ రంగప్ప, తలారి మాదప్ప, గోవర్ధన్ పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 34 మంది ఎంపిక

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు 88 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. శ్రీరామ్ చిట్స్ అండ్ ఇన్సూరెన్స్, యంగ్ ఇండియా ప్రతినిధులు తమ సంస్థల్లో పలు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా 34 మందిని ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు ఎంపిక చేసుకొని అనుమతి పత్రాలను అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, స్కిల్ ప్లేస్‌మెంట్ ఏరియా కో–ఆర్డినేటర్ వీరేష్ ఉన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

దేవనకొండ: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) కర్నూలు జిల్లా 30వ మహాసభలు ఈనెల 12, 13వ తేదీల్లో ఆదోని పట్టణంలో జరగనున్నాయని, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శరత్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నాయని మండిపడ్డారు. మధు, భాస్కర్, చరణ్, బాలరాజు, భరత్ పాల్గొన్నారు.